ఎమ్మెల్యేని కలిసిన పార్‌పెల్లి గ్రామస్థులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 14: మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు శనివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కలిశారు. గ్రామంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనానికి, ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని ఆయనకు విన్నవించారు. అంతకుముందు మహేశ్వర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో నాయకులు చందు, మురళి, గుమ్మడి సాయన్న, రాజేశ్వర్, గంగాధర్, హరీష్, రమేష్, తదితరులు ఉన్నారు.



ఉత్సవాలపై పట్టింపేది?

- వచ్చే నెల మొదటి వారంలో బాసర దసరా నవరాత్రి వేడుకలు
- ఏర్పాట్లకు మిగిలింది 18 రోజులే..
- కనిపించని ముందస్తు ప్రణాళికలు
- ఈసారి మొక్కుబడి ఏర్పాట్లేనా? భక్తులకు తప్పవా కష్టాలు!


ఉత్సవ దినాల్లో అమ్మవారి ఆలయం

(బాసర, సెప్టెంబరు 14)

బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో దసరా వేడుకలు ప్రధాన మైనవి. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఉత్సవాల్లో మూలనక్ష త్రం రోజైతే భక్తులు పోటెత్తుతారు. కానీ ఇక్కడి వసతుల లేమితో ప్రతిసారి భక్తులు ఇబ్బందుల పాలవుతున్నారు. మొక్కుబడిగా ఏర్పాట్లు చేసి మమ అని పించడంతో భక్తులకు కష్టాలు తప్పడం లేదు. ప్రతీసారి అవే ఇబ్బందులు పునరావృతమవుతున్నాయి. కనీసం భక్తులకు తాగుదామంటే నీరు దొరకని పరిస్థితి నెలకొంటుంది. రూ.కోట్ల ఆదాయం భక్తుల నుంచి వస్తున్నా భక్తులు వసతులు క ల్పించడంలో మాత్రం చిత్తశుద్ధి లోపిస్తోంది. ఈసారి వేడుకలకు పరిస్థితి మారుతుందా అంటే అవుననే సమాధానం కరువవుతోంది.

● మిగిలింది 18 రోజులే..

ఈసారి దసరా వేడుకలు అక్టోబరు 3నుంచి దసరా పర్వదినం 12వరకు జరగనున్నాయి. ఈ లెక్కన మహా అయితే మధ్యలో 18 రోజులు మిగిలున్నాయి. ఈవ్యవధిలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాల్సిఉంది. అంతకంటే ముందు చేపట్టాల్సిన సమీక్షలు ముందస్తు రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసుకోవాలి. టెండర్లు పిలిచి పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. కానీ మిగిలిన 20రోజుల్లో టెండర్లు నిర్వహించి ఆ తర్వాత చేపట్టాల్సిన పనులు ఉత్సవాల కంటే ముందే పూర్తిచేయాలి. ఈ క్రమంలో పనులు సక్రమంగా జరుగుతాయా, సమయానికి ముందే పూర్తవుతాయా!? అనే అనుమానాలు కలు గుతున్నాయి. ఎప్పటిలాగే పాత క్యూలైన్లకు కొత్తవి ఏర్పాటుచేయడం, వచ్చిన భక్తులకు నీళ్ళ, పాలు పంపిణీ వంటి సంప్రదాయ ఏర్పాట్లు ఈసారి కూడా చేసి వదిలేస్తే భక్తులకు మళ్లీ కష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రతిసారిఉత్సవాల్లో భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అధికారులకు, ఇక్కడున్న సిబ్బం దికి తెలుసు. ఒక రూట్ మ్యాప్‌ను రూపొ ందిస్తేనే అధికారులతో సమన్వయంతో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.


ఆలయంలో అక్షర శ్రీకార పూజలు జరిపించుకుంటున్న భక్తులు

● ప్రధాన సమస్య ఇక్కడే..

భక్తుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం కోసం చర్యలు తీసుకునే యంత్రాంగం ఇక్కడ కొరవడింది. ఆలయంలో రెండు కారణాలతో భక్తులకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అందులో మొదటిది ప్రధాన ఆలయం ఇరుకుగా ఉండడం, రెండోది అక్షర శ్రీకార పూజలు జరిపించే వైదిక సిబ్బంది కొరత. వీటి వల్ల భక్తులు పూజలు, దర్శనాలకు ఆలస్యమవుతోంది. క్యూలైన్లలో వేచిఉండే సమయం రెట్టింపవుతోంది. ఇరుకుగా ఉన్న ఆలయాన్ని విస్తరించలేకున్నా దర్శనాలకు వెళ్లే భక్తులను అంతరాలయంలోనికి అనుమతి ఇవ్వకుండా ప్రధానద్వారం నుంచే భక్తులను మళ్లిస్తే ఈ సమస్య తీరిపోతుంది. గతంలో ఉత్సవాల సమయంలో, గోదావరి పుష్కరాల సమయంలో ఇలాగే చేశారు. ఇక వైదిక సిబ్బంది నియామకం కోసం రాష్ట్రస్థాయి అధికారులకు దేవస్థాన అధికారులు నివేదికలిచ్చారు. వైదిక సిబ్బందిని పెంచి అక్షరశ్రీకార పూజలు త్వరగా జరిగేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.

● ఏర్పాట్లపై గ్రామస్థుల అసంతృప్తి

సుదూర ప్రాంతాల నుంచి బాసర అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కడ ఇబ్బంది పడడంపై గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దసరాకు దేవస్థాన యంత్రాంగం వారికి సరైన ఏర్పాట్లు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కమిషనర్ నుంచి అనుమతులు రాక ఆలస్యం

● విజయ రామారావు (ఆలయ ఈఓ, బాసర)

ఉత్సవాల ఏర్పాట్లపై అనుమతుల కోసం రెండునెలల కిందటే దేవాదాయ కమిషనర్‌కు నివేదించాం. అనుమతుల్లో జాప్యం జరగడం వల్లే ఏర్పాట్లు ఆలస్యమవుతున్నాయి. మంగళవారం అనుమతులు రావడంతో వివిధ పనుల కోసం టెండర్లు పిలిచాం.

వీటిపై దృష్టి పెడితే..

- ఆలయంలో అక్షర శ్రీకార పూజలు జరిగే మండపాల సంఖ్యను, వైదిక సిబ్బందిని రద్దీకి అనుగుణంగా పెంచాలి
- క్యూలైన్లలో అత్యవసర సమయాల్లో భక్తులు ఉపయోగించుకునే విధంగా మరుగుదొడ్లను, మూత్రశాలలను ఏర్పాటు చేయాలి.
- భక్తులకు ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం తాగునీటిని అందించే ఏర్పాట్లు జరగాలి.
- క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు ఉప్మా, పులిహోర వంటి అల్పాహార ప్యాకెట్లను అందివ్వాలి.
- ఆలయానికి దూరంగా ఏర్పాటు చేసే వాహనాల పార్కింగ్ స్థలాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలి.
- గోదావరి నుంచి రైల్వే స్టేషన్, అమ్మవారి ఆలయానికి ఉత్సవాల రోజుల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలి. ఇందుకోసం ఆర్టీసీ అధికారులతో సంప్రదించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- ఉత్సవ రోజుల్లో ప్రస్తుతం అన్నదాన భవనంతోపాటు మరోచోట భక్తులకు అన్నదాన సౌకర్యాన్ని కల్పించాలి.
- ఉత్సవాల రోజుల్లో వచ్చిన భక్తులకు వివరాలు తెలియజేసేలా రెండు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రసాదం, విక్రయ కౌంటర్లను పెంచాలి.

ముథోల్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో చోరీకి యత్నం


ఫింగర్ ప్రింట్‌ను సేకరిస్తున్న పోలీసులు

ముథోల్ రూరల్, సెప్టెంబరు 14 : మండల కేంద్రమైన ముథోల్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్‌లోకి అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి దొంగతనానికి యత్నించినట్లు ముథోల్ ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ముథోల్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ వెనుక భాగాన ఉన్న వెంటిలేటర్‌ను పగులగొట్టి బ్యాంక్‌లోకి చొరబడ్డారు. బ్యాంక్‌లోని సీసీ కెమెరాల వైర్‌కనెక్షన్, అలారం వైర్ కనెక్షన్ వైర్లు కట్‌చేశారు. బ్యాంక్ అంతా కలియదిరిగి వెళ్లిపోయారు. శనివారం ఉదయం బ్యాంక్ సిబ్బంది బ్యాంక్ తెరిచేసరికి బ్యాంక్‌లోకి ఎవరో చొరబడ్డారని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ముథో ల్ పోలీసుల సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. బ్యాంక్‌లో గుర్తుతె లియని దుండగులు బ్యాంక్‌లోకి వెనుక భాగం నుంచి చొరబడ్డారని ఎలాంటి నగదు అపహరణకు గురికా లేదని ఎస్సై తెలిపారు. బ్యాంక్‌మేనేజర్ ఎస్‌వి.గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దొంగలు దేని కోసం బ్యాంక్‌లోకి ప్రవేశించారనే కోణంలో దర్యాప్తు జరుపు తున్నట్లు ముథోల్ ఎస్సై తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో అవగాహన సదస్సు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 14 : మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం జరగబోయే గణేష్ నిమజ్జన శోభాయాత్ర గురించి మండల ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై మునిగెల హన్మాండ్లు పలు సూచనలు చెప్పారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో సంయమనం పాటించాలని చెప్పారు. సమావేశంలో గ్రామపెద్దలు సికిందర్, ఫసి, అస్లాం, బాబర్‌ఖాన్, రైస్‌ఖాన్, మతపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

'గల్ఫ్ బాధితుల సమస్యలు పరిష్కరించండి'


గల్ఫ్ బాధితుల సమస్యలను ప్రస్తావిస్తున్న శ్రీహరి రావు

నిర్మల్, సెప్టెంబరు 14 : బీసీ సంక్షేమ, రవాణా శాఖ మం త్రి పొన్నం ప్రభాకర్‌తో శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు హాజరయ్యారు. గల్ఫ్ బాధి తుల సమస్యలను శ్రీహరి రావు ప్రస్తావించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమావేశానికి పాల్గొన్నట్టు శ్రీహరిరావు తెలిపారు.

కర్ర వినాయకుడికి ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 14 : నిర్మల్ పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన కర్ర వినాయక విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. బంగల్‌పేట్, బుధవార్‌పేట్, మంజులాపూర్, ఆదర్శనగర్, సోఫీనగర్ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలకు పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 14 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. బాగులవాడ, చిక్కడపల్లి, కమల్ టాకీస్, కస్బా, పాన్‌గల్లీ, శిశు మందిర్, జోహ్రానగర్, కళానగర్, నగరేశ్వర వాడ, చింతకుంట వాడలో ఈ అంతరాయం ఉంటుందన్నారు. బంగల్‌పేట్ ఫీడర్ మరమ్మతు కారణంగా బంగల్‌పేట్, నాయుడివాడ, రామారావు బాగ్, కమల్ రోడ్, గాంధీ నగర్, కబుతర్ కమాన్, బుధవార్‌పేట్ ప్రాంత వాసులకు సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

ఆదర్శనగర్ విద్యుత్‌స్టేషన్ మరమ్మతులు

పట్టణంలోని ఆదర్శనగర్ 11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు ఆదివారం కొనసాగుతున్నందున పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు రాంనగర్, అగ్రాకాలనీ, సిద్దాపూర్, ఈద్గామ్, గాయత్రిపురం, సోఫీనగర్, ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదు.

భైంసాలో పోలీసుల డేగ కన్ను

- భారీగా పోలీసు బందోబస్తు
- 220 సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాల్లో డ్రోన్‌లు
- బందోబస్తులో 300 మందికి పైగా ట్రైనీ పోలీసులు


బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ అవినాష్

భైంసా, సెప్టెంబరు 14 : సమస్యాత్మక ప్రాంతంగా పేరొందిన భైంసా పట్టణ పరిధిలో ఆదివారం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంపై పోలీసు శాఖ దృష్టి సారించింది. మునుపెన్నడూ లేని రీతిలో 220 సీసీ కెమెరాలను నిమజ్జనోత్సవంలో వినియోగిస్తున్నారు. పోలీసు శాఖ ఇది వరకు 170 సీసీ కెమెరాలను వినియోగిస్తుండగా నిమజ్జనోత్సవం కోసం గాను శనివారం అదనంగా 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటికి తోడు సమస్యాత్మక, వివాదాస్పద ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలు వినియోగించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవంలో ఆద్యాంతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ భారీ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలో పర్యటించి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా వినాయక నిమజ్జనోత్సవ ప్రక్రియ ప్రశాంత వాతవరణంలో పూర్తిచేసేందుకు గాను ప్రణాళికబద్ధమైన భద్రత చర్యలు చేపట్టాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, టౌన్ సీఐ రాజారెడ్డిలను ఆదేశించారు. ప్రస్తుతం పట్టణ పరిధిలో నెలకొన్న పరిస్థితులను సమీక్షించి నిమజ్జనోత్సవ వేడుకల బందోబస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్ నేతృత్వంలో టౌన్‌సీఐ రాజారెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు. గతాన్ని దృష్టిలో పెట్టుకొని పటిష్ఠవంతమైన బందోబస్తు వ్యవస్థను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 26 వార్డులను 2 జోన్లుగా, 7 సెక్టారులుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. రెండు జోన్‌ల పరిధిలో మొత్తం 27 పోలీసు పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు పెట్రోలింగ్ టీంలు నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నాయి. పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవ బందోబస్తుకు అదనపు బలగాలు శనివారం తరలివచ్చాయి. బందోబస్తు విధుల్లో అదనపు ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 28 మంది సీఐలు, 41 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు, 250 మంది సివిల్ కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, 100 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా కానిస్టేబుళ్లు, 300 మంది ట్రేయిని కానిస్టేబుళ్లు, బాంబు డిస్పోజల్ టీమ్, డాగ్‌స్క్వాడ్ టీమ్, గ్యాస్ టీమ్ వజ్ర వాహనం పాల్గొంటున్నాయి. వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావీయకుండా ఉండేందుకుగాను పోలీసు శాఖ కట్టుదిట్టమైన ముందస్తు భద్రత చర్యలను చేపట్టింది.

నేడు భైంసాలో గణేష్ నిమజ్జనోత్సవం..

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో ఆదివారం గణేష్ విగ్రహాల నిమజ్జనోత్సవం జరుగనుంది. ఇందుకు గాను మున్సిపల్ అధికార, పాలకవర్గాలు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు. నిమజ్జనోత్సవం నిర్వహించే గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పటిష్టచర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలో ప్రతిష్ఠించిన 150 పైగా విగ్రహాలను గడ్డెన్నవాగు ప్రాజెక్టులో నిమజ్జనం చేయనున్నారు. శోభాయాత్ర కొనసాగే మార్గంలో రోడ్లకు అవసరమైన మరమ్మతులు నిర్వహింపచేసి సౌకర్యాలు మెరుగు పరిచినట్లుగా మున్సిపల్ వైస్‌ఛైర్మన్ జాబీర్ అహ్మద్, కమిషనర్ రాజేష్‌కుమార్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

పట్టణ పరిధిలో ఆదివారం జరిగే వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ ప్రక్రియలో పోలీసుశాఖ విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ వెల్లడించారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వాహకులతో పాటు డీజే, లేజర్ లైట్ నిర్వాహకులు పోలీసుశాఖ విధించిన సూచనలు పాటించి సహకరించాలన్నారు. పరిమితికి మించి డీజే బాక్స్‌లు, లేజర్ లైట్లు పెట్టిన 11 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లుగా తెలిపారు. డీజే బాక్స్‌లతో పాటు లేజర్‌లైట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. టౌన్ సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై శ్రీనివాస్

భైంసారూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ప్రతిఒక్కరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. గణేష్ నిమ జ్జనోత్సవాల్లో డీజేల సౌండ్ పరిమితిగా ఉండేట్లు ఉపయోగించాలని సూచించారు.

శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలి

● మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

నిర్మల్, సెప్టెంబరు 14 : గణేష్ నిమజ్జన శోభాయాత్ర నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసాలో ప్రశాంతంగా నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ జిల్లాకు వచ్చిన సందర్భంగా పలు సూచనలు చేశారు. శబ్ద కాలుష్యం చేసే డీజేలు, ఇతరరాష్ట్రాల డీజేలను అనుమ తించ రాదన్నారు. లేజర్‌లైట్లు పెట్టకుండా చూడాలన్నారు. డీజేల పై పేపర్ ముక్కలు వేసేవి వాడకుండా చూడాల న్నా రు. అలాంటివి వాడే వారిపై చట్టపర చర్యలుంటాయ న్నారు. మద్యం మత్తులో ఉన్నవారిని వాహనాల పైకి అనుమతించవద్దన్నారు. రెచ్చగొట్టే నినాదాలు చేయ వద్దని, మత ప్రార్థన స్థలాల వద్ద ఊరేగింపులను ఆప దంలాంటివి చేయరాదన్నారు. భక్తిశ్రద్ధలతో శోభా యా త్రలో పాల్గొనాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలి గిం చవద్దని సూచించారు. ఉదయమే విగ్రహాలు బయలు దేరేలా చూడాలని, పరిమితికి మించి వాహనాలపై వెళ్లరాదని, రోడ్‌బ్లాక్ కాకుండా చూడాలన్నారు. ముం దస్తు ప్రణాళికతో అన్ని శాఖల అధికారులతో కలిసి పోలీసు అధికారులు పనిచేయాలన్నారు. ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు అమర్చడం, బందోబస్తు తది తర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలు పోలీసు కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేసినట్టు తెలిపారు. జిల్లాలోని ఏర్పాట్లను ఎస్పీ జానకి షర్మిల వివరించారు. నిమజ్జనం సందర్భంగా ఆర్‌అండ్‌బీ, విద్యుత్ అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తు న్నట్టు చెప్పారు. గణేష్ నిమజ్జనం ఆలస్యం కాకుండా గణేష్ మండళ్లకు ఆదేశాలిచ్చామన్నారు. నిమజ్జనానికి అన్ని భద్రత చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు నవీన్, ప్రవీణ్ కుమార్, రామకృష్ణ, అశోక్, ఆర్ఐలు శేఖర్, రమేష్, రామకృష్ణ, ఆర్ఎస్సైలు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

● సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డైరెక్టర్

భైంసా, సెప్టెంబరు 14 : ఆరోగ్యాలకు అనర్థదాయకమైన మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు చిత్తవుతాయని సోషల్ జస్టీస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డైరెక్టర్ ఠాగూర్ దత్తుసింగ్, ముథోల్ నియోజకవర్గ డైరెక్టర్ సాప పండరిలు వెల్లడించారు. శనివారం భైంసా పట్టణంలోని రేయిన్‌బో డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. యువత చెడు అలవాట్ల బారిన పడి ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారని పెర్కొన్నారు. ప్రధానంగా మత్తుపదా ర్థాలు, మాదకద్రవ్యాల ఆకర్షితులై అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారని వివరించారు. విద్యార్థులు, యువత తమ ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించి చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపల్ ఇమ్రాన్, లెక్చరర్లు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తేనే విజయాలు

● మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 14 : క్రీడా కారులు పట్టుదలతో కృషిచేస్తే విజయం సాధించవచ్చునని మున్సిపల్ చైర్మన్‌ఈశ్వర్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు డీఎస్పీ గంగారెడ్డితో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సమిష్టి కృషితో ఆడాలన్నారు. జాతీయస్థాయిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీల్లో విజయ ఢంకా మ్రోగించాలని ఆకాంక్షించారు. 22 జిల్లాల నుంచి 900ల మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. బేస్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

నేడు నిర్మల్‌లో భారతరత్న విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ

నిర్మల్, సెప్టెంబరు 14 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్వేశ్వరయ్య మార్గ్, చైన్‌గేట్ వద్ద భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం ఏర్పాటు చేయాలన్న ఇంజనీర్ల కల ఆదివారం ఫలించనుంది. రాజకీయ కేంద్రంగా పేరున్న నిర్మల్‌లో విశ్వేశ్వరయ్య కల్చరల్ అసోసియేషన్ స్థాపించి ప్రతి ఏటా విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహిస్తూ అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నారు. నిర్మల్‌లో విశ్వేశ్వరయ్య విగ్రహ ఏర్పాటు కోసం సంఘం అనేక ప్రయత్నాలు చేసింది. ప్రభుత్వానికి సైతం వినతి చేసింది. కానీ ఫలించలేదు. ఎట్టకేలకు జిల్లాలోని పంచాయతీ రాజ్ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.రాజేందర్ రావు తనయుడు అభిజిత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆయన సొంత ఖర్చులతో విగ్రహ ఏర్పాటుకు ముందుకు రావడంతో ఇంజనీర్ల చిరకాల స్వప్నం నేడు ఫలించనుంది. అభిజిత్ అందించిన మూడు లక్షల ఆర్థిక సహాయంతో విగ్రహం రూపుదిద్దుకొని నేడు ఆవిష్కరణకు సిద్ధమైంది.

పాల్గొననున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటలకు విశ్వేశ్వరయ్య మార్గ్ చైన్ గేట్ వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఇంజనీరింగ్ అధికారులు హాజరు కానున్నారు.

విశ్వేశ్వరయ్య మట్టివిగ్రహం తయారు

నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన యువ కళాకారుడు, కవి పోలీసు భీమేష్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా ఎనిమిది ఇంచుల మట్టి విగ్రహాన్ని ఆకర్షణీయంగా తయారు చేశారు. మూడు గంటల్లో విగ్రహం తయారు చేసి నీటి రంగులు అద్ది తీర్చిదిద్దారు. మట్టి విగ్రహం తయారు చేసి ఔరా అనిపించుకున్నాడు.

ఘనంగా హిందీ దివస్

కుంటాల, సెప్టెంబరు 14 : మండల కేంద్రంలోని కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో శనివారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలో ఎక్కువ మాట్లాడే భాషలో హిందీ భాష ఒకటని ప్రిన్సిపల్ సంతోష్ అన్నారు. అధికారిక భాష హిందీ దేవనాగరిక లిపి నుంచి రూపొందించబడిందని ఈ భాష ఇండో యూరోపియన్ భాష సంతతికి సంబంధించిన హిందు ఆర్యన్ శాఖకు చెందినదని డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌తో తృటిలో తప్పిన ప్రమాదం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 14 : మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్ వద్ద నిర్మల్ నుంచి భైంసా వైపు వెళ్తున్న బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం... బస్సుటైర్ పేలడంతో ఒక్కసారిగా శబ్దం వచ్చింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలపడంతో ఈ ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణికులు 120 మంది ఉన్నారని కండక్టర్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 14 : నిర్మల్ పట్టణంలోని ఏఎన్‌రెడ్డి కాలనీలో గల ఏఎంఆర్ టవర్స్‌లో శనివారం మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ వేద పండితులు దేగామ సంజయ్ శర్మ, స్వాగత్ శర్మలు ఈ కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. గణపతి నవరాత్రుల్లో మహిళలు కుంకుమ పూజచేస్తే దీర్ఘాయుష్షుతో పాటు సౌభాగ్యం కలుగుతుందని చెబుతారు. కాగా కుంకుమ పూజ అనంతరం ఇక్కడ ప్రతిష్ఠించిన గణనాథుడికి మహిళలు 21 రకాల విశేష హారతులను ఎంతో నిష్ఠగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కార్యవర్గంతో పాటు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

డాక్టర్ రాములుకు సన్మానం

నిర్మల్, సెప్టెంబరు 14 : గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని అసోసియేషన్ 70వ ఫౌండేషన్ డే సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్మల్‌కు చెందిన డాక్టర్ రాములును సన్మానించారు. డాక్టర్ దామెర రాములు చేస్తున్న సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రముఖ న్యూరో విభాగ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి తదితరులు జ్ఞాపిక, అవార్డును అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఇందిరా, ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులు పాల్గొన్నారు.



దేవుగూడ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జీ డీడీ వసంత్‌రావు

దేవుగూడ పాఠశాల ఆకస్మిక తనిఖీ

● టీచర్‌కు షోకాజ్ నోటీసులు

ఉట్నూర్, సెప్టెంబరు 14: మండలంలోని హస్నాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని పూసిగూడిశ మోడల్ స్కూల్‌ని ఏటీడీవో క్రాంతితో కలిసి శనివారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జీ డీడీ వసంత్‌రావు తెలిపారు. దీనిలో భాగంగా దేవుగూడ పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా.. ఒక్క టీచర్ సీతారాం మాత్రమే విధుల్లో ఉన్నారని, మరో టీచర్ రాథోడ్ సురేఖ నిన్న మధ్యాహ్నం నుంచి సెలవు మంజూరు పెట్టకుండా బడికి గైర్హజరు కావడంతో ఆమెకి షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు ఐటీడీఏ పీవోకు సమాచారం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.



పిట్టబొంగరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

సిరికొండ, సెప్టెంబరు 14: సిరికొండ మండల పరిధిలోని పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను, ఆసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాథోడ్ ప్రతాప్ నాయక్, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

'రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టు సిగ్గుమాలిన చర్య'

ఉట్నూర్, సెప్టెంబరు 14: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్‌ని ముందస్తు హౌజ్ అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని ఆదిలాబాద్ బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మరపరాజు, జిల్లా ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ శేషరావులు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ టీకం హరిప్రసాద్ మాట్లాడుతూ చలో జైనూరు కార్యక్రమానికి ముందు హైదరాబాద్‌లో పోలీసులు అక్రమ హౌజ్ అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రగా అభివర్ణిస్తున్నామన్నారు. కొమురంభీం జిల్లా జైనూరు సంఘటనకు బాధ్యులైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోకపోగా.. అక్కడ ఉన్న గిరిజనులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నా.. దానికి నిరసనగా బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చలో జైనూర్ కార్యక్రమానికి నిర్వహించకుండా పోలీసులు అక్రమ హౌజ్ అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.

ముగిసిన ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

తాంసి రూరల్, సెప్టెంబరు 14: మండల పరిధిలోని లేబర్ కార్డు కలిగిన నిరుద్యోగ యువలకు లేబర్ డిపార్టుమెంట్ వారి సౌజన్యంతో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఎన్ఏసీ వారి ఆధ్వర్యంలో 15 రోజుల ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం 25 మంది తాపీ మేస్త్రీలతో 15 రోజుల శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు సెంటర్ ఇన్‌చార్జి మహేష్‌కుమార్ తెలిపారు.

'కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 14: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాములు అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు చెల్లించాలని కార్మికుకు కనీస వేతనం చెల్లించాలన్నారు.

ఘనంగా జాతీయ హిందీ భాషా దినోత్సవం

● పలుచోట్ల హిందీ ఉపాధ్యాయులకు సన్మానం



సుంకిడిలో హిందీ ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న దృశ్యం

తలమడుగు, సెప్టెంబరు 14: మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వై.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ హిందీ ఉపాధ్యాయులు హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ వేటుకులేను పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హిందీ భాష గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థి విద్యార్థులు చిత్ర లేఖనం ద్వారా హిందీపై ఉన్న తమ మమకారాన్ని చాటుకున్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కాగా హిందీ సాహిత్యం, స్వాతంత్ర ఉద్యమంలో హిందీ యొక్క పాత్ర తదితర అంశాలతో విద్యార్థిని, విద్యార్థులకు సుకుమార్ పెట్కులే క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి, సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నామ్దేవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్: జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పాటలు కవితలు, నృత్యాలు అలరించాయి. హిందీ ఉపాధ్యాయులు అరవింద్ హిందీ భాషా ఔనత్యాన్ని వివరించారు. తల్లిప్రేమ ఎంత గొప్పదో,మన జాతీయ భాష హిందీ కూడా అంత గొప్పదని వివరించారు. తులసీ దాస్, రహీమ్, మీరాబాయి, మున్షీ ప్రేమ్‌చంద్ లాంటి గొప్ప కవులు చక్కని పద్యాల ద్వారా సమాజానికి నైతిక విలువలను బోధించారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర మాట్లాడుతూ హిందీ భాషా దేశంలో అధిక సంఖ్యాకులు మాట్లాడే భాషా అని, అందరూ నేర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, హిందీ దివాస్ దినోత్సవం సంబరాలను జడ్పీఎస్ ఎస్ సాలెవాడ(కె) పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు శేషరావుని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ హిందీ దినోత్సవాన్ని 14 సెప్టెంబరు 1949లో హిందీ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నారని, కాని భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత 1953 నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న నిర్వహించారన్నారు. హిందీ ఉపాధ్యాయుడు శేషరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 343 ఆర్టికల్ ప్రకారం అమల్లోకి వచ్చిందని దీనిని రాజ్యభాషగా గుర్తించడం కోసం రాజ్యాంగ సభ నిర్వహించడం జరిగిందన్నారు. అప్పుడు ఉన్న రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వారి అధ్యక్షతన జరిగినదన్నారు. హిందీ దినోత్సవం రాజేంద్రసింహ అనే ప్రముఖ హిందీ పండితులు మరి రచయిత అతని సేవలు గుర్తిస్తూనే జరుపుకుంటారన్నారు. ఇందులో పాఠశాల టీచర్లు శ్రీధర్, మనోజ్‌రెడ్డి, జాదవ్ రవికుమార్, గౌతమ్, విఠల్, తదితరులున్నారు.

నేరడిగొండ: హిందీ దినోత్సవం సందర్భంగా కేజీబీవీ పాఠశాలలో హింది దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషా ఉపాధ్యాయురాలిని షాహిన్ ప్రత్యేకాధికారి రజిత ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న హింది భాషను జాతీయ భాషగా గుర్తించినట్లు తెలిపారు. అప్పటి నుంచి హింది ధినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

గుడిహత్నూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, హిందీ కవి, ప్రేమ్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉద్యోగాలు పొందడంలో హిందీ భాషా కీలకమన్నారు. 1949 సెప్టెంబరు 14న జాతీయ భాషాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. విద్యార్థులకు హిందీ భాషా ప్రాముఖ్యతను తెలియజేసేలా ఉపన్యాసాలు, హిందీ, కవితల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు రాథోడ్ శ్రావణ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భోథ్: మండలంలోని సోనాల గ్రామ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హిందీ భాషపైన ఆయా తరగతులకు చెందిన పలువురు విద్యార్థులు మాట్లాడారు. అంతకుముందు ఉపాధ్యాయులు హిందీ దేశ భాష అని, భారతదేశంలో హిందీ ద్వితీయ భాషగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. హిందీ వచ్చిన వారు ఎక్కడైనా జీవించ వచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు సన్మానించారు.

విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆదిలాబాద్, సెప్టెంబరు 14: విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని వార్డు నెం.45 భుక్తాపూర్ కాలనీలో శనివారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విష జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం కాలనీలో హెల్త్ క్యాంపు నిర్వహించి పలువురికి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, వార్డ్ కౌన్సిలర్ బండారి సతీష్ పాల్గొన్నారు.

● సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నార్నూర్: వర్షాకాలములో గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. హెల్త్ సూపర్‌వైజర్ చవాన్ చరణ్‌దాస్ అన్నారు. శనివారం గుండాల గ్రామ పంచాయతీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరం మేరకు మందులు అందించారు. అనంతరం కార్యదర్శి కాశీరం పరిశుభ్రత పై ప్రజలకు పలు సలహా సూచనలు అందించారు. వారి వెంట సిబ్బంది విస్తరణ అధికారి రాథోడ్ తులసిదాస్, హిమబిందు, గోకుల్ జవహర్, మానుకుబాయి, తదితరులున్నారు.



భక్తాపూర్ కాలనీలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్



లక్కారంలో వినాయకునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



పొన్నారిలో ఎమ్మెల్యే అనిల్‌కు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న మహిళలు

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు

ఉట్నూర్, సెప్టెంబరు 14: మండలంలోని లక్కారంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండపాలకు ఉచిత కరెంట్‌ను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిరాం గణేష్ మండలి సభ్యులు ఎమ్మెల్యేను సన్మారించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు మహిళల ఘన స్వాగతం

తాంసి రూరల్: మండలంలోని ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన వినాయకులను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వస్తున్నారు అనే విషయాన్ని తెలుసుకున్న మహిళలు ఆయా గణేష్ మండలాల వద్ద బారులు తీరి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బొట్టుపెట్టి స్వాగతం పలికారు. పొన్నారి, హస్నాపూర్, కప్పర్ల సావర్గావ్ గ్రామాలలో ఆయనకు మహిళలు తిలకం దిద్దితే ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణపతులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తాను నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. తమ పార్టీ ప్రభుత్వంలో లేకపోయినప్పటికీ మహిళల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తానన్నారు. యువకుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి వారికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రూ.లక్షా11 వేలకు గణేష్ లడ్డూ వేలం

తాంసి రూరల్, సెప్టెంబరు 14: తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలోని శ్రీ మురళీ కృష్ణ ఆలయంలో వినాయక లడ్డూ వలేం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకుడు తొగరి సురేందర్ రూ. లక్షా 11 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. దీంతో సుందర సత్సంగ్ సభ్యులు, గ్రామస్థులు యువకుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సుందరసత్సంగ్ ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 14: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉత్తమ్ నేతృత్వంలోని కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ డిమాండ్‌చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ అమలు కోసం మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కమిటీతో తెలంగాణలో మాలలకు ఏ మాత్రం న్యాయం జరగదని, ఏఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. మంత్రుల కమిటీలోనే మాలలకు అన్యాయం జరిగిందన్నారు. ఈ కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్‌చే శారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్, మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తం, నాయకులు మాస్కే రాజవర్ధన్, వాగ్మారే ప్రతాప్, కాలే శివాజీ, సూర్యవంశీ, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు

సోన్ రూరల్, సెప్టెంబరు 14: మండలంలోని జాఫ్రాపూర్, సిద్దులకుంట, లోకల్ వెల్మల్ గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ హాజరైన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 18 కోట్ల మందిని బీజేపీ సభ్యులుగా మార్చడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రతి బూత్‌లో 200ల మంది బీజేపీ సభ్యత్వంలో చేర్పడం జరుగుతుందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వమున్న ఏకైక పార్టీ బీజేపీ పార్టీ అని తెలంగాణలో అత్యధిక మందిని బీజేపీ సభ్యులుగా చేర్పించేలా 8800002024 ఫోన్ నెంబర్ ద్వారా ఒక మిస్డ్ కాల్‌తో సభ్యత్వ నమోదు చేపట్టడం జరుగుతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, మండల సీనియర్ నాయకులు మార గంగారెడ్డి, బర్ల హరీష్ రెడ్డి, అల్లూరి నర్సారెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు మహిపాల్ రెడ్డి, రాజేశ్వర్, డైరెక్టర్ రాజేశ్వర్, నాయకులు సాయన్న, రాజు, చందర్, ఎం. గంగన్న, శ్రీనివాస్, సత్యపాల్, ముత్యం రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థినులు

ఉట్నూర్, సెప్టెంబరు 14: జిల్లాకేంద్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినిలు సత్తా చాటారని ప్రిన్సిపల్ హారిత తెలిపారు. అశ్విని హైజంప్‌తో పాటు 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం దక్కించుకుందని, రేణుక 100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం దక్కించుకుందని, మాధవి 100 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానంలో, మహేశ్వరి 400మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో, సంధ్యారాణి హైజంప్‌లో మూడవ స్థానాన్ని, ప్రియాంక హైజంప్‌లో మూడవ స్థానాన్ని, ప్రియాంక హైజంప్‌లో రెండవ స్థానాన్ని దక్కించుకోవడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బుగుప్తా గిరిజన విద్యార్థినులను అభినందించారన్నారు.

'కార్మిక వెల్ఫేర్ బోర్డును పటిష్ట పర్చాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 14: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలనే ప్రతిపాదనను ప్రభుత్వం మానుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు పటిష్ట పర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదిలాబాద్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఆశన్న, వెంకట్ నారాయణ, జగన్ సింగ్ పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 14: ఆదిలాబాద్ పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ కార్మిక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారం, తదితర వాటిపై చర్చించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ కార్మికులకు ప్రతీనెల ఐదో తేదీలోపు జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు పండగ సెలవులు ఇవ్వాలన్నారు. నాయకులు రాజు, చిరంజీవి, కాంతారావు, అశోక్, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి'

తలమడుగు, సెప్టెంబరు 14: యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా అధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కోరారు. యువతను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తుందన్నారు. సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం కోడథ్ గ్రామంలో సర్వ గణేష్ దగ్గర పూజలు చేసి, తలమడుగులో బ్లూ టీమ్ యూత్ వారి గణేష్ దగ్గర, మాల సంఘం గణేష్ దగ్గర పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ ఆనంద్, పురుషోత్తం, తదితరులున్నారు.





పెండింగ్ డీఏలను విడుదల చేయాలి : టీయూటీఎఫ్

ఇచ్చోడ, సెప్టెంబరు, 14: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇచ్చోడ, గేర్జం, కోకస్‌మన్నూర్, జామిడి, జల్డా, నర్సాపూర్, మల్యాల, నవేగాం, గుండి, తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ సమస్యలను వేంటనే పరిష్కరించాలని కోరారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు పర్చాలన్నారు. స్పౌస్ బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ సభ్యులు బత్తుల భూమయ్య, అశోక్, రమణా రెడ్డి, ప్రఫూల్ చందర్, చంద్ర కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీయూటీఎఫ్ సభ్యులు





నేడు మద్యం దుకాణాల మూసివేత

ఆదిలాబాద్, సెప్టెంబరు 14: జిల్లాకేంద్రంలో ఈనెల 15వ తేదీన ఆదివారం మద్యం దుకాణాలను మూసి వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆదివారం తొమ్మిదో రోజు వినాయక నిమజ్జనం శోభాయాత్రను పురస్కరించకొని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా మద్యం వ్యాపారులు ఎవరైనా విక్రయాలు జరిపితే.. వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ స్పష్టం చేశారు.



నడింపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీటీజీ ఏపీవో డాక్టర్ మనోహర్

కోలం గిరిజనులు.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : ఏపీవో

తలమడుగు, సెప్టెంబరు 14: ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఆర్థికంగా వెనుకబడ్డ కోలం గిరిజనులను మూఢనమ్మకాలను వదిలి విద్య, ఉద్యోగ ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐటీడీఏ పీటీజీ ఏపీవో డాక్టర్ మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీపూర్, నడింపల్లి తదితర కోలం గిరిజన గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మూఢ నమ్మకాలతో ఆరోగ్యంగా ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. కోలం గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు ప్రత్యేక నిధులతో అభివృద్ధి పరిచిందన్నారు. అదేవిధంగా విద్యార్థులు తల్లిదండ్రులు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉండేందుకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వారి సమస్యలను పరిశీలించేందుకు ప్రభుత్వం ముందు ఉందన్నారు. అనంతరం ఆయా కులం గిరిజన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. వాటి సమస్య పరిష్కారం కోసం పీవో దృష్టికి తీసుకెళ్తామన్నారు. లక్ష్మీపూర్‌లో అసంపూర్తిగా ఉన్న బావి పనులను పరిశీలించారు. అలాగే నడింపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కోలం గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

'అనాథ పిల్లలను ఆదుకోవాలి'

సిరికొండ రూరల్, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని దళిత సామాజిక వర్గానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు దాసరి శ్రీనివాస్ దంపతులు ఇటీవల అకాల మరణం చెంది, వారి పిల్లలు అనాథలుగా మారడంతో ప్రభుత్వం ఆ పిల్లలను అన్నివిధాలుగా ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అన్నారు. శనివారం ఆయన వారి నివాసానికి వెళ్లి అనాథలైన పిల్లలను పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. రెండు నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను కోల్పోయి, దినదిన గండంగా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అనాథ పిల్లలను జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యుడు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ తరపున ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గాయక్వాడ్ సురేష్ మాదిగ, సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్ మాదిగ, గొట్టిముక్కుల మధుకర్, సుంకే అనిల్, కోలపురి గురుమూర్తి, ఒరగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక శోభాయాత్రకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను ఆహ్వానిస్తున్న హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు

ఉట్నూర్, సెప్టెంబరు 14: మండలకేంద్రంలో ప్రతిష్ఠించిన వినాయక నవరాత్రి విగ్రహాలకు సోమవారం నిమజ్జనం శోభాయాత్ర నిర్వహిస్తున్నందున కార్యక్రమానికి హాజరు కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌ను హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ గారి హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొండేరి రమేష్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా ఈనెల 16న మండలకేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన సామూహిక శోభాయాత్ర కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే బొజ్జుకు ఆహ్వానం పలికారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. అయితే, వినాయక శోభాయత్రకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షికారి శ్రీనివాస్, అరికెల అశోక్, ఆత్రం తిరుపతి, రాముని నాగన్న, పవర్ దేవిదాస్, ముత్యం సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఏకగ్రీవ పంచాయతీలకు.. నిధులేవీ!?

- జిల్లాలో 2019 పంచాయతీ ఎన్నికల్లో పలు గ్రామ పంచాయతీల ఏకగ్రీవం
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నజరానా రూ.10 లక్షలకు పెంపు
- మొత్తం 162 ఏకగ్రీవ పంచాయతీలకు ఇప్పటికీ అందని ప్రోత్సాహక నిధులు
- పాలకవర్గాల పదవీ కాలం ముగిసినా.. తప్పని ఎదురుచూపులు
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలు
- మళ్లీ గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు చేస్తున్న అధికారులు
- ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సి నిధులు మొత్తం రూ.16 కోట్ల 20 లక్షలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం మొండిచేయే చూపింది. ప్రోత్సాహక నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎంతో ఆశపడ్డ పంచాయతీలకు నిరాశే మిగిలింది. గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసి పోయినా.. ప్రభుత్వం నజరానా ఊసెత్తడమే లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నజరానాను రూ.10లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధుల కోసం 2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 162 గ్రామ పంచాయతీల పాలక వర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.16కోట్ల 20లక్షలు ప్రభుత్వం నుంచి జిల్లాకు రావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క గ్రామ పంచాయతీకి ప్రోత్సాహక నిధులను అందించిన దాఖలాలు లేవు. ఐదేళ్ల పాటు అధికారుల చుట్టూ తిరిగిన సర్పంచ్‌లు పదవీ కాలం ముగిసిపోవడంతో పూర్తిగా సైలెంటై పోయారు. మళ్లీ పంచాయతీ ఎన్నికల ను నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల హడావుడి మొదలైనట్లు కనిపిస్తుంది. గతంలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహ నిధులను అందించక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 468 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈసారి కొత్తగా తలమడుగు మండలం ఝరిపూనగూడ, బజార్‌హత్నూర్ మండలం ఈసాపూర్, ఇచ్చోడ మండలం ఎల్లమ్మగూడ, తాంసి మండ లం అత్నంగూడ, ఉట్నూర్ మండలం వడ్గాల్‌పూర్(కె)మరో ఐదు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా గ్రామ పంచాయతీల సంఖ్య 473కు చేరింది. ప్రభుత్వ ప్రకటనతో పంచాయతీలకు భారీ నజరానా అందుతుందని గ్రామపెద్దలు ఏకమై పట్టుబట్టి పాలకవర్గాలను ఏకగ్రీవం చేసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కొందరు అభ్యర్థులు ఎన్నికల పోటీలో నిలిచిన ఈ నజ రానా కారణంగానే పోటీ నుంచి తప్పుకొని ఏకగ్రీవానికి సహకారాన్ని అందిం చారు. ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని భావించారు. కానీ ఐదేళ్ల గడిచిపోయినా.. ప్రభుత్వ ప్రోత్సాహకం అందని ద్రాక్షగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిధులు రాలే.. అభివృద్ధి జరగలే!!

గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ముగిసిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను మంజూరు చేయనేలేదు. దీంతో జిల్లాలో 162 గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర కాలయాపన జరిగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఏకగ్రీవ పంచాయతీలకు అందించే నజరానా నిధుల ఊసే లేకుండా పోయింది. గతంలో ఐదేళ్ల పాటు ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేశారు. చివరకు ప్రభుత్వ అంచనాలు తారుమారు కావడం, సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి పోవడంతో ప్రోత్సాహక నిధులు అందకుండానే పోయాయి. ప్రోత్సాహక నిధులు వస్తాయన్న ఆశతో కొందరు సర్పంచ్‌లు శాశ్వత సమస్యల పరిష్కారానికి పనులను కూడా చేపట్టారు. ఇప్పటికీ చేపట్టిన పనుల బిల్లులు రాకపోవడంతో కొందరు సర్పంచ్‌లు ఆందోళనకు గురవుతున్నారు. అయినా ప్రభుత్వానికి పట్టింపే లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో పెట్టుబడులు చేతికి రాక సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు ఎంతో ఉత్సాహంగా పనిచేసినా ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గ్రామ ప్రజలు నమ్మకంగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వం ప్రోత్సహించక పోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గాడితప్పుతున్న 'పల్లె ప్రగతి'

పంచాయతీలకు సరిపడా నిధులు లేకపోవడంతో పల్లె ప్రగతి గాడి తప్పుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నెల నెలా అందిస్తున్న నిధులు ఏమూలాన సరిపోవడం లేదంటున్నారు. పల్లె ప్రగతి పనులు ముందుకు సాగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అరకొరగా అందుతున్న నిధుల నుంచి పంచాయతీ ట్రాక్టర్ వాయిదాలు, మల్టీపర్పస్ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, ఇతరాత్ర ఖర్చులకే సరిపోతోందని తెలుస్తుంది. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో చాలా గ్రామాలు అభివృద్ధికి దూరమవుతున్నాయి. పలుమార్లు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయింది. పల్లె ప్రగతికి ప్రణాళికలు రూపొందించిన సరిపడా నిధులు లేకపోవడంతో గ్రామాభివృద్ధికి ఆటంకంగా మారింది. గ్రామాల్లో పల్లె ప్రగతి కింద నర్సరీలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, తదితర పనులను చేపట్టిన అవి ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. సాధారణంగా పంచాయతీలకు కేటాయించే అరకొర నిధులతో శాశ్వత సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిపై ప్రత్యేక దృష్టిని సారించిన ప్రోత్సాహక నిధుల మంజూరు మాత్రం మరిచిపోయింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు అందుతాయో? లేవో?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదేళ్లు గడిచినా.. నిధులు రాకపాయే

: కుడ్మెత భీంరావు, డెడ్రా మాజీ సర్పంచ్, బజార్‌హత్నూర్



పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికైతే గత ప్రభుత్వం ప్రోత్సాహక నిధులను అందిస్తుందని చెప్పింది. కానీ ఇప్పటి వరకు ఆ నిధుల మాటే ఎత్తడం లేదు. రూ.10లక్షల ప్రోత్సాహక నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని భావించాం. కానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్ల పదవీ కాలం ముగిసిపోయినా.. నిధులు మాత్రం రాలేదు. ప్రభుత్వం ఆశ చూపి నిధులను మంజూరు చేయలేదు. రూ.10 లక్షల నిధులను అందించి ఉంటే మా గ్రామంలో మరింత అభివృద్ధి జరిగి ఉండేది. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిధులను మంజూరు చేస్తే బాగుండేది.

ఎలాంటి ఆదేశాలు లేవు

: శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్



జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు అందించే ప్రోత్సాహక నిధుల విషయంలో ఎలాంటి ఆదేశాలు లేవు. గతంలోనే ప్రోత్సాహక నిధులు అందించాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. అయినా నిధుల మంజూరిపై స్పష్టమైన ఆదేశాలు లేవు. జిల్లావ్యాప్తంగా 162 గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. గతంలో సర్పంచ్‌లు నిధుల విషయమై పలుమార్లు మాదృష్టికి తీసుకొచ్చారు. కానీ ప్రభుత్వం నుంచే మంజూరు కాలేదు. సర్పంచ్‌ల పదవీ కాలం కూడా ముగిసిపోవడంతో ప్రోత్సాహక నిధుల విడుదల కష్టంగానే కనిపిస్తోంది.